ఉత్తరం

# కాకతీయ

TG TEL/25/A1234 www.kakatiyanews.com

మంగళవారం, 06 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 47 | పేజీలు: 4 వెల: 5

## ఏసీబీ వలలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

- భవన నిర్మాణానికి రూ.8 లక్షల లంచం డిమాండ్
- రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ పట్టివేత
- రెడ్ హ్యాండెండ్‌గా చిక్కిన జీహెచ్ఎంసీ గోల్కొండ జోన్ తులసీరాం సునీత
- లంచం సొమ్ముతో పాటు లెక్కల్లో చూపని రూ.2.50 లక్షలు స్వాధీనం



2

## జనం గుండెల్లో జెండా ఎగురేస్తాం

- ప్రజాస్వామిక వాదులమంతా ఒక్కటవుతాం
- జన తెలంగాణ పేరుతో కొత్త రాజకీయ వేదికకు సన్నాహాలు
- ప్రజాస్వామికవాదుల సమీకరణ ప్రయత్నాలు
- రెండు మూడు నెలల్లో పార్టీ పేరు ఖరారు
- కాంగ్రెస్.. బీఆర్ఎస్.. బీజేపీలకు ప్రత్యామ్నాయమే మా లక్ష్యం
- ప్రజా సమస్యలే ఎజెండా.. విద్య, వైద్యం, ఉపాధిపై పోరాటం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు కసరత్తు
- తెలంగాణ రాష్ట్ర సాధనతోనే ఆకాంక్షలు నెరవేరలేదు
- పాలకులు కమిషన్ ఏజెంట్లుగా మారారు
- ప్రజలే రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నడపాలన్నది ఆకాంక్ష
- తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో మాజీ మావోయిస్టు నేత, తెలంగాణ ఉద్యమకారుడు లంకా పాపిరెడ్డి చిట్‌చాట్



తెలంగాణలో మరో రాజకీయ వేదికకు కసరత్తు మొదలైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు మాజీ మావోయిస్టు నేత, తెలంగాణ ఉద్యమకారుడు లంకా పాపిరెడ్డి ప్రకటించారు. 'జన తెలంగాణ' లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్తామని.. విద్య, వైద్యం, ఉపాధి ప్రధాన ఎజెండాగా ఉద్యమాలు నిర్మిస్తామని వెల్లడించారు. తెలంగాణ సాధించినా ప్రజలు ఆశించిన మార్పు రాలేదని, రాష్ట్ర సాధన వెనుక ఉన్న ఆకాంక్షలు నెరవేరలేదని అన్నారు. పాలకులు ప్రజా ప్రయోజనాల కంటే కమీషన్ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజల్లో అసంతృప్తి ఉందని పేర్కొంటూ.. ఆ ఖాళీని ప్రజాస్వామిక రాజకీయ ప్రత్యామ్నాయంతో భర్తీ చేయాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ఉమ్మడి జిల్లాల కేంద్రంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ వివిధ వర్గాలను సమీకరిస్తున్నామని, రెండు మూడు నెలల్లో పార్టీ పేరు ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన రాజకీయ ఆలోచనలు, భవిష్యత్ కార్యాచరణపై లంకా పాపిరెడ్డి మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

4

## పెళ్లి చేసుకునే వరకు ఇక్కడే ఉంటా!

- ప్రియుడి ఇంటి ముందు టెంట్ వేసి యువతి మౌన పోరాటం
- మూడేళ్లు ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్నాడంటూ ఆరోపణ
- వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ ఇంటి ముందు ఉద్రిక్తత



3

## ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి డీఎంహెచ్‌వో

- ఫిజియోథెరపీ ఆసుపత్రి పునఃప్రారంభానికి రూ.2 లక్షలు డిమాండ్
- మొదటి విడతగా రూ.లక్ష తీసుకుంటుండగా ఏసీబీ దాడి
- పోలీసుల అదుపులో హెల్త్ ఇన్‌స్పెక్టర్, డీఎంహెచ్‌వో డ్రైవర్
- రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ స్వర్ణకుమారిపై కేసు



2



## ఖజానా ఖల్లాస్

- బకాయిల సుడిగుండంలో రాష్ట్ర ఆర్థికం
- రూ.51వేల కోట్లు దాటిన కాంట్రాక్టర్ల బకాయిలు
- ఉద్యోగులు, పెన్షనర్లకు మరో రూ.14 వేల కోట్ల బకాయిలు
- ఔట్‌సోర్సింగ్ వేతనాలు రూ.2 వేల కోట్లు పెండింగ్
- జీతాలు, పెన్షన్ల వాటా 19.47 శాతానికి పెరుగుదల
- అప్పుల అసలు, వడ్డీలతో ఖజానాపై మరింత భారం
- కొత్త రుణాలతో పాత బకాయిల చెల్లింపుల పరిస్థితి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై బకాయిల భారం నానాటికీ పెరుగుతోంది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి గత ప్రభుత్వం నుంచి దాదాపు రూ.40 వేల కోట్ల పాత బిల్లులు వారసత్వంగా వచ్చాయని పేర్కొంటున్నా.. వాటిలో కొంత చెల్లింపులు చేసిన తర్వాత కూడా పెండింగ్ భారం తగ్గకపోగా మరింత పెరిగిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.51 వేల కోట్లను దాటినట్లు అందుబాటులో ఉన్న వివరాలు సూచిస్తున్నాయి. దీనికి ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన బకాయిలు తోడవడంతో సర్వీస్, డెవలప్‌మెంట్ చెల్లింపుల భారం రూ.65 వేల కోట్లకు పైగా చేరినట్లు పేర్కొంటున్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చడం, మరోవైపు పాత బకాయిలను తీర్చడం ప్రభుత్వ ఖజానాకు భారంగా మారుతోంది.

**పనులు పూర్తయినా.. బిల్లులు పెండింగ్**

రోడ్లు, నీటిపారుదల, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన చెల్లింపులు నిలిచిపోవడంతో కాంట్రాక్టింగ్ రంగంలోని చిన్న, మధ్యతరహా వ్యాపారులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు పేర్కొంటున్నారు. పాత బిల్లులు క్లియర్ కాకపోవడంతో కొత్త పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడానికి వెనుకంజ వేస్తున్నారని, ఫలితంగా అభివృద్ధి పనుల వేగంపైనా ప్రభావం పడుతోందని వివరాలు సూచిస్తున్నాయి.

**ఉద్యోగుల బకాయిలూ భారమే**

ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన సిబ్బందికి చెల్లించాల్సిన

........(తరువాయి 2లో)

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

### కేంద్రం గుప్పిట్లోకి ఎన్నికల సంఘం

- ఓటు హక్కును కాపాడేందుకు ఉమ్మడిగా ఉద్యమిస్తాం
- సీఈసీ పదవికి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని ఇండియా కూటమి నేతల ధ్వజం
- అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర
- హన్మకొండ కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన
- జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం



**కాకతీయ, హన్మకొండ :** స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘాన్ని కేంద్రంలోని అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని, దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు జరగాలంటే కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్ పదవికి రాజీనామా చేయాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా అంబేద్కర్ సెంటర్ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన చేపట్టి జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఇండియా కూటమి నేతలు విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేలా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉన్నప్పటికీ.. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు, రాజకీయ పక్షాలు కలసి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

**అంబేద్కర్ సెంటర్ నుంచి పాదయాత్ర**

అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కలెక్టరేట్ వరకు కొనసాగింది. కూటమి

........(తరువాయి 2లో)

## బోగస్ ఫారం–7లపై కొరడా

- తప్పుడు దరఖాస్తులతో ఓట్ల తొలగింపునకు కుట్ర చేస్తే చర్యలు
- క్షుణ్ణంగా విచారించిన తర్వాతే ఓటు తొలగింపు
- ముషీరాబాద్, గోషామహల్, బహదూర్‌పురాలో వెలుగులోకి వచ్చిన వ్యవహారం
- ఇప్పటికే 29 వేల ఫారం–7 దరఖాస్తులు
- ప్రీ–ఫిల్డ్ ఫారం–7లపై సీఈవో సుదర్శన్‌రెడ్డి సీరియస్
- జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్లకు సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు తప్పుడు సమాచారంతో ఫారం-7 దరఖాస్తులు సమర్పిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ఎవరి ఓటు తొలగించాలో ముందే వివరాలు ముద్రించిన ఫారం-7లను భారీగా సమర్పిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎన్నికల యంత్రాంగం అప్రమత్తమైంది. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం, తప్పుడు ప్రకటనలతో ఫారం-7



దరఖాస్తులు సమర్పిస్తే చట్ట ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని

........(తరువాయి 2లో)

## హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్లిన అపరేష్ కుమార్ సింగ్
- జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ స్థానంలో సామ్ కోషికి బాధ్యతలు
- మూడు దశాబ్దాల న్యాయవృత్తి అనుభవం
- ఛత్తీస్‌గఢ్ హైకోర్టు నుంచి తెలంగాణకు బదిలీ
- 2023లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం

2



## 35 మంది జేఎల్‌లపై వేటు



- నకిలీ పీజీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలంటూ నిర్ధారణ
- 16కుపైగా వర్సిటీల నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- షోకాజ్‌లకు సంతృప్తికర సమాధానాలు రాకపోవడంతో తొలగింపు
- 2023లో 3 వేల మందికిపైగా కాంట్రాక్ట్ జేఎల్‌ల క్రమబద్ధీకరణ
- వొకేషనల్ అధ్యాపకులకు అన్యాయం జరిగిందంటూ ఆవేదన
- సమగ్ర విచారణకు ఉస్మానియా నిరుద్యోగ జేఏసీ డిమాండ్

2

# 35 మంది జేఎల్‌లపై వేటు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. నకిలీ పీజీ సర్టిఫికెట్లతో జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు పొందినట్లు నిర్ధారణ అయిన 35 మందిని విధుల నుంచి తొలగిస్తూ ఇంటర్మీడియట్ విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. క్రమబద్ధీకరణ సమయంలో సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలపై అనుమానాలు రావడంతో అధికారులు 16కుపైగా విశ్వవిద్యాలయాల నుంచి వివరాలు సేకరించి పరిశీలించారు. సంబంధిత సర్టిఫికెట్లు నకిలీవని ఆయా వర్సిటీల నుంచి సమాచారం రావడంతో 35 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారి వివరణలను పరిశీలించిన అనంతరం సమాధానాలు సంతృప్తికరంగా లేవని తేల్చి తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో 2023లో చేపట్టిన క్రమబద్ధీకరణలో అర్హతలు, సర్టిఫికెట్ల పరిశీలన ఎంతవరకు జరిగింది? ఇంకా ఎక్కడైనా లోపాలు ఉన్నాయా? అన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి.

**3 వేల మందికి పైగా క్రమబద్ధీకరణ**

2014కు ముందునుంచి కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లుగా పనిచేస్తున్న 3 వేల మందికిపైగా ఉద్యోగులను 2023లో ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఈ ప్రక్రియలో పలువురు ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో పీజీ చదివినట్లు పేర్కొంటూ ధ్రువపత్రాలు సమర్పించారు. వాటి ప్రామాణికతపై సందేహాలు వ్యక్తం కావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంబంధిత విశ్వవిద్యాలయాలను సంప్రదించి రికార్డులను సరిపోల్చింది. 16కుపైగా వర్సిటీల నుంచి వచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని నకిలీగా తేలిన సర్టిఫికెట్లపై చర్యలు తీసుకుంది. ఈ క్రమంలోనే 35 మంది జేఎల్‌ల తొలగింపు జరిగింది. తాజా చర్యతో క్రమబద్ధీకరణ ప్రక్రియలో సమర్పించిన మిగిలిన ధ్రువపత్రాలపైనా ఇదే స్థాయిలో పరిశీలన జరగాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

**వొకేషనల్ అధ్యాపకుల ఆవేదన**

జనరల్ విభాగంలో క్రమబద్ధీకరణ జరిగిన సమయంలో వొకేషనల్ విభాగంలో దీర్ఘకాలంగా పనిచేసిన అధ్యాపకులకు మాత్రం న్యాయం జరగలేదని కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. 26 సంవత్సరాలుగా ఇంటర్ విద్యలో సేవలందిస్తున్నప్పటికీ సాంక్షన్ పోస్టులు లేవన్న కారణంతో తమను క్రమబద్ధీకరణకు దూరం చేశారని వారు చెబుతున్నారు. మరోవైపు 2023లో వొకేషనల్ విభాగానికి చెందిన 184 మంది కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లకు సంబంధించిన నియామకాలపై ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో.. క్రమబద్ధీకరణలో ఎవరి అర్హతలను ఏ ప్రాతిపదికన పరిశీలించారు? ఎవరిని ఎందుకు మినహాయించారు? అనే అంశాలపై పూర్తి రికార్డులను బయటపెట్టాలని బాధిత అధ్యాపకులు కోరుతున్నారు.

**35 మందితోనే ముగిసిందా?**

తాజాగా 35 మంది జేఎల్‌లను తొలగించిన నేపథ్యంలో క్రమబద్ధీకరణ పొందిన మొత్తం సిబ్బంది విద్యార్హతలు, నియామక రికార్డులు, సర్వీస్ వివరాలను ఒకే ప్రమాణంతో పునఃపరిశీలించాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో కొందరు జేఎల్‌ల సర్టిఫికెట్లపై అనుమానాలు వ్యక్తమైనప్పుడు 37 మందికి షోకాజ్ నోటీసులు జారీ అయినట్లు పేర్కొనగా.. ఇప్పుడు 35 మందిని తొలగించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సంఖ్యల నేపథ్యంలో మిగిలిన క్రమబద్ధీకరించిన ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన ఎంతవరకు పూర్తయింది? ఇంకా ఎన్ని రికార్డులు పరిశీలించాల్సి ఉంది? అన్నదానిపై శాఖ స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**సర్టిఫికెట్లతోపాటు సర్వీస్ రికార్డులూ**

కేవలం పీజీ సర్టిఫికెట్ల ప్రామాణికతకే పరిమితం కాకుండా క్రమబద్ధీకరణకు అవసరమైన మొత్తం అర్హతలను పరిశీలించాలని నిరుద్యోగ వర్గాలు కోరుతున్నాయి. సర్వీస్‌లో గ్యాప్‌లు, నియామక తేదీలు, సర్వీస్ నిరంతరత, సాంక్షన్ పోస్టు, విద్యార్హతలు, ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల నుంచి సమర్పించిన మెమోలు, ధ్రువపత్రాల ప్రామాణికత వంటి అంశాలను రికార్డులతో సరిపోల్చాలని అంటున్నారు. అదే విధంగా ఇంటర్ విద్యలో లైబ్రేరియన్లు, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రమోషన్లలోనూ ఇతర రాష్ట్రాల విద్యార్హత పత్రాల వినియోగంపై ఆరోపణలు ఉన్నందున వాటిపైనా పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల పాత్రపై ప్రశ్నలు**

క్రమబద్ధీకరణ సమయంలో విద్యార్హతలు, సర్వీస్ వివరాలు, నియామక రికార్డులను పరిశీలించిన అధికారుల బాధ్యతపైనా ప్రశ్నలు వస్తున్నాయి. సర్టిఫికెట్లు నకిలీవని సంబంధిత విశ్వవిద్యాలయాల నుంచే సమాచారం వచ్చినట్లయితే.. అదే పత్రాలు 2023లో క్రమబద్ధీకరణకు ఎలా అంగీకరించబడ్డాయి? వాటి ప్రాథమిక పరిశీలనలో లోపం ఎక్కడ జరిగింది? అనే అంశాలను తేల్చాల్సి ఉందని నిరుద్యోగ సంఘాలు కోరుతున్నాయి. క్రమబద్ధీకరణ ప్రక్రియలో తప్పుదోవ పట్టించే పత్రాలు సమర్పించిన ఉద్యోగులపై చర్యలతోపాటు వాటిని పరిశీలించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని అంటున్నాయి. 2023లో క్రమబద్ధీకరించిన ప్రతి జూనియర్ లెక్చరర్ విద్యార్హత, నియామక ప్రక్రియ, సర్వీస్ నిరంతరత, సాంక్షన్ పోస్టు, ధ్రువపత్రాల ప్రామాణికతను స్వతంత్రంగా పరిశీలించాలని ఉస్మానియా నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే 16కుపైగా విశ్వవిద్యాలయాల నుంచి వివరాలు తెప్పించి 35 మందిపై తొలగింపు చర్యలు తీసుకున్న నేపథ్యంలో మిగిలిన రికార్డులపైనా ఇదే విధమైన తనిఖీ నిర్వహించాలని కోరుతోంది. నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు నిర్ధారణ అయితే ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు, క్రమబద్ధీకరణ సమయంలో పరిశీలనలో లోపాలు ఉంటే బాధ్యుల పాత్రను కూడా తేల్చాలని డిమాండ్ చేస్తోంది. 2023 క్రమబద్ధీకరణపై పూర్తిస్థాయి రికార్డు పరిశీలన జరిగితేనే ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన 35 మంది వ్యవహారం ఒంటరి ఘటననా.. లేక ప్రక్రియలో మరిన్ని లోపాలున్నాయా అన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.



## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చేతుల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎన్నికల వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ చేరుకున్న అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించి, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఇతర నాయకులు అన్నారు. దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు జరిగే పరిస్థితులు ఉండాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై తమ నిరసనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**కలెక్టరేట్ ఎదుట ఆందోళన**

డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పాల్గొన్నారు. టీఎస్ మేరా కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకట్రాజం, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నున్నా అప్పారావు, టీజేఎస్ అధ్యక్షుడు చిల్లా రాజేంద్ర ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి దుద్దిల్ల శ్రీను బాబు, కుడా చైర్మన్ గుండు సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పులి ప్రియాంక, చందుపట్ల రాజీ రెడ్డి, టీపీసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాస్ రావు, బత్తిని శ్రీనివాస్, కూచన రవళి, ఐవైసీ జాతీయ కోఆర్డినేటర్ గొట్టిముక్కల సాగరిక రావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు కూర వెంకట్, మారంరెడ్డి కౌటిల్ రెడ్డి, వివిధ సెల్‌ల అధ్యక్షులు, మండల, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఆర్‌జీపీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి

**కాకతీయ, హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషి నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో జస్టిస్ సామ్ కోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. సుదీర్ఘ న్యాయవృత్తి, ప్రభుత్వ న్యాయవాదిగా అనుభవం, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు, శాశ్వత న్యాయమూర్తిగా పనిచేసిన అనుభవంతో పాటు తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్న జస్టిస్ సామ్ కోషికి న్యాయవ్యవస్థలో విస్తృత అనుభవం ఉంది. 1967 ఏప్రిల్ 30న జన్మించిన జస్టిస్ సామ్ కోషి 1987లో కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, 1990లో న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. 1991 మార్చి 9న న్యాయవాదిగా నమోదు చేసుకుని వృత్తిలోకి ప్రవేశించారు. సివిల్, రాజ్యాంగ, సర్వీస్, కార్మిక చట్టాలకు సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించారు. 1991 నుంచి 2000 అక్టోబర్ వరకు మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన ఆయన.. 2000 నవంబర్ నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు బిలాస్‌పూర్‌లో కొనసాగారు.

**ప్రభుత్వ న్యాయవాదిగా సేవలు**

న్యాయవాదిగా ఉన్న సమయంలో జస్టిస్ సామ్ కోషి ప్రభుత్వానికి కూడా న్యాయసేవలు అందించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2005-06లో డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హిదాయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ అకాడమిక్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా వ్యవహరించారు. సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం తదితర సంస్థలకు న్యాయపరమైన వ్యవహారాల్లో ప్రాతినిధ్యం వహించారు. దీర్ఘకాల న్యాయవాద వృత్తి అనంతరం 2013 సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి నియమితులయ్యారు. 2016 మార్చి 8న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం న్యాయమూర్తుల బదిలీలో భాగంగా తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2023 జూలై 27న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.

**గతంలోనూ తాత్కాలిక బాధ్యతలు**

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలను జస్టిస్ సామ్ కోషి గతంలోనూ తాత్కాలికంగా నిర్వహించారు. 2025 జూలై 18 నుంచి 19 వరకు అప్పటి ప్రధాన న్యాయమూర్తి అందుబాటులో లేని సమయంలో తాత్కాలికంగా చీఫ్ జస్టిస్ విధులను నిర్వర్తించారు. ఇప్పుడు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో మరోసారి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. దాదాపు మూడు దశాబ్దాల న్యాయవృత్తి అనుభవంతో పాటు ప్రభుత్వ న్యాయవాదిగా, డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా, హైకోర్టు అదనపు, శాశ్వత న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి పనిచేశారు. తెలంగాణ హైకోర్టులోనూ సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్న నేపథ్యంలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఆయన అనుభవం కీలకం కానుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టుకు వెళ్లనున్న నేపథ్యంలో హైకోర్టు పరిపాలనా వ్యవహారాలను జస్టిస్ సామ్ కోషి నిర్వహించనున్నారు.

## ఏసీబీ వలలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

- **భవన నిర్మాణానికి రూ.8 లక్షల లంచం డిమాండ్**
- **రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ పట్టివేత**
- **రెడ్ హ్యాండెండ్‌గా చిక్కిన జీహెచ్ఎంసీ గోల్కొండ జోన్ తులసీరాం సునీత**
- **లంచం సొమ్ముతో పాటు లెక్కల్లో చూపని రూ.2.50 లక్షలు స్వాధీనం**

**కాకతీయ, హైదరాబాద్ :** భవన నిర్మాణానికి అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.8 లక్షల లంచం డిమాండ్ చేసి, మొదటి విడతగా రూ.4 లక్షలు స్వీకరిస్తుండగా జీహెచ్ఎంసీ గోల్కొండ జోన్, సర్కిల్-33 టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ తులసీరాం సునీత ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సోమవారం మెహదీపట్నంలోని కార్యాలయంలో ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు నిర్వహించిన దాడిలో ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడి భవన నిర్మాణానికి సంబంధించిన వ్యవహారంలో రూ.8 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలను పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగించేందుకు అనుమతించడం, భవిష్యత్తులో ఇబ్బందులు కలిగించకుండా సహకరించేందుకు లంచం అడిగినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా రూ.4 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

**మరో రూ.2.50 లక్షల నగదు**

తులసీరాం సునీత వద్ద నుంచి రూ.4 లక్షల లంచం మొత్తాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదనంగా లెక్కల్లో చూపని రూ.2.50 లక్షల నగదు కూడా ఆమె వద్ద గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. అధికారిక విధులను అక్రమంగా, నిజాయితీకి విరుద్ధంగా నిర్వహించి అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు పేర్కొంది. లంచం కేసులో పట్టుబడిన తులసీరాం సునీతను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని నాంపల్లిలోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట ఆమెను హాజరుపరచగా న్యాయపరమైన రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఫిర్యాదుదారుడి భద్రతా కారణాల దృష్ట్యా ఆయన వివరాలను ఏసీబీ గోప్యంగా ఉంచింది.

# ఖజానా ఖల్లాస్



**(మొదటిపేజీ తరువాయి)**

బకాయిలు కూడా భారీగా పేరుకుపోయాయి. 2026 ఆగస్టు నాటికి ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి సంబంధించిన బకాయిలు సుమారు రూ.14 వేల కోట్లకు చేరినట్లు పేర్కొంటున్నారు. విధుల్లో ఉన్న ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యం బకాయిలు, సరెండర్ లీవ్ గ్రాంట్లు కలిపి రూ.6,200 కోట్ల మేర ఉండగా.. రిటైర్డ్ ఉద్యోగుల సాధారణ భవిష్య నిధి, పెన్షన్ ప్రయోజనాల బకాయిలు రూ.8 వేల కోట్లను దాటినట్లు వివరాలు చెబుతున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4,575 కోట్ల బకాయిలను విడుదల చేసినప్పటికీ.. ఈ ఏడాదిలోనే సుమారు 9 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో గ్రాట్యుటీ, పెన్షన్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి అదనపు భారం చేరింది.

**మరో రూ.2 వేల కోట్లు వేతనాల బకాయిలు**

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందికి చెల్లించాల్సిన వేతనాల్లోనూ బకాయిలు పేరుకుపోయాయి. ఈ విభాగాలకు సంబంధించి సుమారు రూ.2 వేల కోట్ల వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించే సిబ్బందికి వేతనాలు సకాలంలో అందకపోవడం పరిపాలనా వ్యవస్థపైనా ప్రభావం చూపే అవకాశముంది. మరోవైపు 2023 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న 6 కరువు భత్యం వాయిదాల్లో ఇటీవల 2 వాయిదాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపినప్పటికీ.. ఇంకా 4 వాయిదాలు బకాయిలుగానే ఉన్నాయి.

**జీతాలు.. పెన్షన్ల భారం**

రాష్ట్ర బడ్జెట్‌లో జీతాలు, పెన్షన్ల వ్యయం వాటా కూడా పెరుగుతున్నట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు సూచిస్తున్నాయి. 2023-24లో రాష్ట్ర మొత్తం బడ్జెట్‌లో జీతాలు, పెన్షన్ల వాటా 17.81 శాతంగా ఉండగా.. 2026-27 ఆర్థిక సంవత్సరానికి అది 19.47 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో పన్నుల ఆదాయం, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు అంచనాలకు అనుగుణంగా సమకూరకపోవడం, మరోవైపు పాత రుణాల అసలు, వడ్డీ చెల్లింపుల భారం పెరగడం ఖజానాపై ఒత్తిడిని పెంచుతున్నట్లు వివరాలు పేర్కొంటున్నాయి. ఫలితంగా మూలధన వ్యయానికి కేటాయించాల్సిన నిధులపై కూడా ఒత్తిడి ఏర్పడే పరిస్థితి నెలకొంది.

**పాత అప్పులకు కొత్త రుణాలా?**

ప్రభుత్వ ఆదాయంలో పెద్ద భాగం జీతాలు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, రుణాల చెల్లింపులకు వెళ్తుండటంతో అభివృద్ధి వ్యయానికి అందుబాటులో ఉండే నిధులపై ఒత్తిడి పెరుగుతోంది. పాత అప్పుల అసలు, వడ్డీలు చెల్లించేందుకు కొత్తగా రుణాలు సమీకరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆర్థిక పరిస్థితిపై ఉన్న వివరాలు సూచిస్తున్నాయి. ఆదాయం-వ్యయం మధ్య అంతరం పెరిగితే కొత్త బకాయిలు పేరుకుపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ల బిల్లులు, ఉద్యోగుల ప్రయోజనాలు, వేతనాలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో కొత్త పనులకు నిధుల కేటాయింపులు మరింత సవాలుగా మారుతున్నాయి.

**ఖజానాకు ముందున్న సవాలు**

ఒకవైపు సంక్షేమ పథకాలను కొనసాగించడం.. మరోవైపు ఇప్పటికే పేరుకుపోయిన రూ.65 వేల కోట్లకు పైగా సర్వీస్, డెవలప్‌మెంట్ బకాయిలను సమతుల్యం చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక సవాలుగా మారింది. పన్నేతర ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రాధాన్యతా ప్రాజెక్టులకు నిధులను క్రమబద్ధీకరించడం, ఖర్చుల్లో ఆర్థిక క్రమశిక్షణ పాటించడం అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదాయ వనరులు పెంచుకోకుండా బకాయిల చెల్లింపులు, సంక్షేమ పథకాలు, జీతాలు-పెన్షన్లు, రుణాల సేవలను ఏకకాలంలో నిర్వహించడం కష్టతరంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తుండగా.. ఉద్యోగులు, పెన్షనర్లు తమ ప్రయోజనాల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఖజానాపై పెరుగుతున్న బకాయిల భారం రానున్న కాలంలో ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు ఎంతటి సవాలుగా మారుతుందన్నది కీలకంగా మారింది.

## బోగస్ ఫారం–7లపై కొరడా

**(మొదటిపేజీ తరువాయి)**

జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఫారం-7తోపాటు కొత్త ఓటు నమోదు కోసం ఉపయోగించే ఫారం-6, ఇతర దరఖాస్తుల్లోనూ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు ఎల్లుండితో ముగియనున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ముందే ముద్రించిన ఫారం–7లు**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఎవరి పేర్లు తొలగించాలో వివరాలు ముందుగానే ముద్రించిన ఫారం-7లు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నట్లు ఎన్నికల అధికారుల దృష్టికి వచ్చింది. సాధారణంగా ఒక ఓటరు అనర్హుడని భావించినప్పుడు, ఆ ఓటు నకిలీ లేదా డూప్లికేట్ అని అనుమానం ఉన్నప్పుడు, ఓటరు మరణించినప్పుడు, సంబంధిత చిరునామాలో నివసించనప్పుడు ఓటు తొలగించాలని అభ్యంతరం వ్యక్తం చేసేందుకు ఫారం-7ను ఉపయోగిస్తారు. అయితే సంబంధిత ఓటరు వివరాలను ముందుగానే ముద్రించి, ఫారాలను కట్టలుగా సమర్పిస్తున్న ఘటనలు వెలుగులోకి రావడంతో వాటి వెనుక ఎవరు ఉన్నారనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**మూడు నియోజకవర్గాల్లో కలకలం**

హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ నియోజకవర్గాల్లో ప్రీ-ఫిల్డ్ ఫారం-7లు కనిపించినట్లు సమాచారం. ముషీరాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ పరిధిలో ఇలాంటి పత్రాలు లభించాయని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం బహదూర్‌పురా నియోజకవర్గంలోనూ ముందే ముద్రించిన ఫారం-7లు కనిపించగా.. శనివారం గోషామహల్‌లోనూ ఇదే తరహా పత్రాలు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో ఈ ఫారాలను ఎవరు తయారు చేస్తున్నారు? ఎక్కడ ముద్రిస్తున్నారు? బూత్ స్థాయి అధికారులకు ఎవరు అందజేస్తున్నారు? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

**29 వేల దరఖాస్తులపై దృష్టి**

తెలంగాణలో ఇప్పటివరకు ఫలానా ఓటర్ల పేర్లు తొలగించాలని కోరుతూ ఎన్నికల అధికారులకు దాదాపు 29 వేల ఫారం-7 దరఖాస్తులు అందినట్లు సమాచారం. వీటిలో తప్పుడు వివరాలతో సమర్పించిన దరఖాస్తులు ఏమైనా ఉన్నాయా? ముందుగానే ఓటర్ల వివరాలు ముద్రించి సమర్పించిన ఫారాలు ఎన్ని? అనే అంశాలను పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముషీరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన ఘటనపై ఇప్పటికే విచారణకు ఆదేశించినట్లు ఎన్నికల యంత్రాంగం తెలిపింది. ప్రీ-ఫిల్డ్ ఫారం-7లను గుర్తించిన బూత్ స్థాయి అధికారులు వాటిని స్వీకరించకుండా నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని ఎన్నికల వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

**ఓటు తొలగింపునకు ముందు విచారణ**

ఒక వ్యక్తి ఓటును తొలగించే ముందు ఫారం-7లో పేర్కొన్న కారణం నిజమా కాదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలని సీఈవో సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సంబంధిత ఓటరు నిజంగా అక్కడ నివసిస్తున్నారా? మరణించిన వ్యక్తి పేరేనా? ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయా? ఇచ్చిన చిరునామా సరైనదేనా? వంటి అంశాలను నిర్ధారించిన తర్వాతే తొలగింపు ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి నిజమైన ఓటరును జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తే చట్ట ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా కొత్త ఓటు కోసం సమర్పించే ఫారం-6, ఇతర దరఖాస్తుల్లోనూ తప్పుడు సమాచారం లేదా తప్పుడు ప్రకటనలు ఇస్తే బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

**సీఈవోకు కాంగ్రెస్ ఫిర్యాదు**

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఎవరి పేర్లు తొలగించాలో పేర్కొంటూ ముందే ముద్రించిన ఫారం-7లు లభిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం సీఈవో సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. ముషీరాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ పరిధిలో ఇలాంటి పత్రాలు లభించాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకే విధానంలో మూడు నియోజకవర్గాల్లో పత్రాలు కనిపించడం వెనుక సమన్వయంతో వ్యవహారం జరుగుతోందా? అనే అనుమానాలను వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అసలు మూలాలను గుర్తించాలని కోరారు.

**పోలీసులకు టీపీసీసీ ఫిర్యాదు**

నిజమైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు ప్రీ-ఫిల్డ్ ఫారం-7లను ఉపయోగిస్తున్నారంటూ టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ కూడా హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్‌కుమార్, సభ్యులు సమర్పించిన ఫిర్యాదులో ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ నియోజకవర్గాల్లో ఒకే తరహా ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఫారం-7లను ఎవరు తయారు చేశారు? ఎక్కడ ముద్రించారు? ఎవరు పంపిణీ చేశారు? ఓటర్ల వ్యక్తిగత ఎన్నికల సమాచారాన్ని ఎక్కడి నుంచి సేకరించారు? అనే అంశాలపై దర్యాప్తు చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం పాత్రపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే రాజకీయ హోదాతో సంబంధం లేకుండా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు ఫారం-7లపై అందుతున్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించిన తర్వాతే ఓట్ల తొలగింపు చేపట్టాలని సీఈవో ఆదేశించడంతో.. వచ్చే రోజుల్లో ఈ వ్యవహారంపై ఎన్నికల యంత్రాంగం చేపట్టే విచారణ కీలకంగా మారింది.

## ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి డీఎంహెచ్‌వో

- **ఫిజియోథెరపీ ఆసుపత్రి పునఃప్రారంభానికి రూ.2 లక్షలు డిమాండ్**
- **మొదటి విడతగా రూ.లక్ష తీసుకుంటుండగా ఏసీబీ దాడి**
- **పోలీసుల అదుపులో హెల్త్ ఇన్‌స్పెక్టర్, డీఎంహెచ్‌వో డ్రైవర్**
- **రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ స్వర్ణకుమారిపై కేసు**

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** లంచం తీసుకుంటూ రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడినట్లు సమాచారం. రాజేంద్రనగర్ శివరాంపల్లిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఎల్‌బీనగర్‌లో లైసెన్స్ లేదన్న కారణంతో మూసివేసిన ఫిజియోథెరపీ ఆసుపత్రిని తిరిగి తెరవడానికి అనుమతి ఇవ్వాలంటే రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందినట్లు తెలిసింది. లంచం మొత్తంలో మొదటి విడతగా రూ.లక్ష చెల్లించేందుకు ఫిర్యాదుదారు అంగీకరించినట్లు సమాచారం. సోమవారం రూ.లక్షను హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకు అందించినట్లు తెలుస్తోంది. ఆయన ఆ నగదును డీఎంహెచ్‌వో డ్రైవర్ కృష్ణయ్యకు ఇచ్చినట్లు సమాచారం. కృష్ణయ్య డబ్బులను తీసుకుని కారులో పెట్టేందుకు వెళ్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిసింది. నగదు పట్టుబడిన అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. లంచం డిమాండ్‌కు సంబంధించిన వీడియో ఆధారాలు కూడా ఏసీబీ అధికారుల వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలను అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం. లంచం వ్యవహారంపై ఫిర్యాదు అందిన నేపథ్యంలో శివరాంపల్లిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. కార్యాలయంలోని రికార్డులు, సంబంధిత పత్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. లైసెన్స్, ఆసుపత్రి పునఃప్రారంభానికి సంబంధించిన అనుమతుల వ్యవహారంపైనా అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

**దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు**

డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన లంచం వ్యవహారంపై ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారికంగా నమోదైన అభియోగాలు, స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర ఆధారాలపై దర్యాప్తు పూర్తయిన అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అందుతున్న వివరాల ప్రకారం డాక్టర్ స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డ్రైవర్ కృష్ణయ్యను ఏసీబీ అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.



# బల్దియా గ్రీవెన్స్‌కు 81 ఫిర్యాదులు

- టౌన్‌ప్లానింగ్‌దే టాప్. ఇంజినీరింగ్ విభాగంపై 28 ఫిర్యాదులు
- నెలలుగా పరిష్కారం లేదంటున్న బాధితులు
- ప్రజావాణిలో వెల్లువెత్తిన నగర సమస్యలు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి (బల్దియా గ్రీవెన్స్) కార్యక్రమానికి 81 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో టౌన్‌ప్లానింగ్‌కు 32, ఇంజినీరింగ్‌కు 28, ఆరోగ్యం, పారిశుద్ధ్యానికి 9, రెవెన్యూకు 9, నీటి సరఫరాకు 3 దరఖాస్తులు అందాయి. టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలపైనే అత్యధిక ఫిర్యాదులు రావడం గమనార్హం. పైడిపల్లి లక్ష్మీ గణపతి కాలనీలో రూ.47 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులు ఏడాదిన్నరగా ప్రారంభం కాలేదని 3వ డివిజన్ వాసులు ఫిర్యాదు చేశారు. సుబేదారిలో ఎల్ఆర్ఎస్ ఫీజు రూ.24,398 చెల్లించినా, సంబంధం లేని సర్వే నంబర్‌పై ఉన్న కోర్టు కేసును చూపి దరఖాస్తును నిలిపివేశారని ఎన్. నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. 36వ డివిజన్‌లో 2022 నుంచి అండర్‌డ్రైనేజీ పొంగుతోందని ఎస్. రఘు వాపోయారు. మట్టెవాడ గోపాలస్వామి గుడి తోట మైదానంలో వాకర్స్ కోసం ఓపెన్ జిమ్, పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని వాకర్స్ అసోసియేషన్ కోరింది. బతుకమ్మ వేడుకలకు క్లీనింగ్, లైటింగ్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఓ సిటీ వాసులు విజ్ఞప్తి చేశారు. ముత్తకొండ కాలనీలో రెండు నెలలుగా నీళ్లు రావడం లేదని సిరిమళ్ల వెంకటయ్య, చింతగట్టు బస్టాండ్ నుంచి రైస్‌మిల్లు వరకు రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలతో ప్రమాదాలు జరుగుతున్నాయని 65వ డివిజన్ వాసులు ఫిర్యాదు చేశారు.



## 7వ వార్డులో అభివృద్ధి పనులకు వేగం

- 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం
- కాలువల పరిశుభ్రత, చెట్ల తొలగింపునకు ప్రత్యేక చర్యలు
- వార్డు సభ్యుడు మాదరి మధు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు



**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** ములుగు జిల్లా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 7వ వార్డులో అభివృద్ధి, పారిశుధ్య పనులకు వేగం పెరిగింది. సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్‌బాబు ఆదేశాల మేరకు వార్డు సభ్యుడు మాదరి మధు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. సుమారు 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం చూపేందుకు నిర్మాణ పనులు ప్రారంభించారు. రోడ్లు లేని ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణంతోపాటు ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను తొలగిస్తూ దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. వార్డులో చెత్తాచెదారం పేరుకుపోకుండా పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నారు. రామన్నగూడెం రోడ్డుపై ప్రమాదకరంగా మారిన ఎండిన చెట్లను, విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించారు. రైతులు ధాన్యం బస్తాలను తరలించే సమయంలో ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో చెట్ల తొలగింపు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో మాన్‌హోల్ కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు.

## మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పేదింటి ఆడబిడ్డలకు అండ
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**కాకతీయ, పెద్దవంగర:** ప్రజా పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో పెద్దవంగర మండలానికి చెందిన 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచించారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని తెలిపారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేని వారు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రంగు మురళిగౌడ్, మాజీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు సంకెపల్లి రవీందర్‌రెడ్డి, సైదులు, హరికృష్ణ, శ్రీనివాస్, మహేష్, వేణు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా

- రూ.1.32 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ
- అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి భరోసా



**కాకతీయ, రాయపర్తి/పాలకుర్తి:** పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించి వారి కుటుంబాలకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాలకు చెందిన 132 మంది లబ్ధిదారులకు రూ.1,32,13,992 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు నేరుగా అందేలా పారదర్శక పాలన అందిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని, పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందువరుసలో నిలిపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇకపై 'మీ ప్రమాణం' యాప్‌లోనే హాజరు

- వచ్చే వారం నుంచి తప్పనిసరి అమలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం



**కాకతీయ, వరంగల్ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఇకపై 'మీ ప్రమాణం' యాప్ ద్వారానే హాజరు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, సమయపాలన, జవాబుదారీతనం పెంచే లక్ష్యంతో ఈ విధానాన్ని వచ్చే వారం నుంచి తప్పనిసరిగా అమలు చేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఐడీఓసీ సమావేశపు హాలులో 'మీ ప్రమాణం' హాజరు యాప్ వినియోగంపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పని చేస్తున్న ప్రతి అధికారి, ఉద్యోగి యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ద్వారా వేతనాలు పొందుతున్న ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా యాప్‌ను వినియోగించాలని సూచించారు. యాప్ వినియోగం, హాజరు నమోదు ప్రక్రియపై ఈడీఎం శ్రీకాంత్ అధికారులకు అవగాహన కల్పించారు. సాంకేతిక సమస్యలు, సందేహాలు ఉంటే ఈడీఎంను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డీఆర్వో వసంతకుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, ఈడీఎం శ్రీకాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా.. పిల్లలను బడిబాట పట్టిద్దాం

**'విద్యా ప్రేరణ'తో డ్రాప్‌అవుట్ విద్యార్థులకు అండ**



**కాకతీయ, వరంగల్ :** పాఠశాల మానేసిన విద్యార్థులను తిరిగి బడిబాట పట్టించి, డ్రగ్స్, ధూమపానం, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా 'విద్యా ప్రేరణ' కార్యక్రమాన్ని వరంగల్ పోలీస్ కమిషనరేట్ చేపట్టింది. యువత డ్రగ్స్‌కు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు విశ్లేషణలో గుర్తించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరంగల్ సబ్ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువు మానేసిన 42 మంది విద్యార్థులను గుర్తించారు. వారిలో 22 మందిని కౌన్సెలింగ్, తల్లిదండ్రులతో చర్చలు, అవసరమైన సహాయ సహకారాలతో తిరిగి పాఠశాలల్లో చేర్పించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ తదితర విద్యా సామగ్రిని అందిస్తూ చదువు కొనసాగించేలా ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించడంతో కార్యక్రమం ముగియదని పోలీసులు తెలిపారు. వారి హాజరు, విద్యాభ్యాసం, ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన కౌన్సెలింగ్, ప్రోత్సాహం అందిస్తామన్నారు. ప్రతి పిల్లవాడిని బడిలో ఉంచడం, డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం, వారి భవిష్యత్తును కాపాడడమే ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీసులు పేర్కొన్నారు.

## వేతన కోతతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన

- జీఓ 1181ను నిలిపివేయాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ కు వినతి



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీఓ ఆర్టీ 1181 వేతన కోత రూపంలో గుదిబండగా మారింది. ప్రస్తుత హోదాలు, వేతనాలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ కార్మిక సంఘాల నేతలు సోమవారం బల్దియా గ్రీవెన్స్ లో కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, శానిటరీ, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్, డిఆర్ఎఫ్, కెమిస్టులు, హెల్పర్లుగా 2025 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర కేటగిరీలకు మార్చడం వల్ల వేతనాలు తగ్గుతున్నాయని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్ ఆపరేటర్లను డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా చూపడంతో హోదాకే ఎసరు వస్తోందన్నారు.

**పే ప్రొటెక్షన్ కల్పించాలి**

గతంలోని జీఓఎంఎస్ నం.14, 60, 63 ప్రకారం వేతన విధానాన్ని కొనసాగించాలని, జీఓ ఆర్టీ 1037 ద్వారా ఇచ్చిన వేతన రక్షణను వర్తింపజేయాలని కోరారు. తాజా జీఓ 1181తో వేతన కోత పడితే నిత్యావసర ధరలు, పిల్లల చదువులు, వైద్యం, ఇంటి అద్దెలతో కుటుంబాలు గడవడం కష్టమని వాపోయారు. పారిశుధ్యం, నీటి సరఫరా, ఇంజినీరింగ్, రెవెన్యూ తదితర విభాగాల్లో నిరంతరం సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలని, ప్రభుత్వంపై అదనపు భారం కోరడం లేదని, ప్రస్తుత వేతనాలకే పే ప్రొటెక్షన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిజిఎంసిఓ, ఐఎన్ టియుసి, ఏఐటియుసి, సిఐటియు, ఎంఆర్ పిఎస్, బిఆర్ టియు , జేఏసి, టిఎంబికె నాయకులు పాల్గొన్నారు.

## న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

- శ్రీధర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి
- చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరేళ్ల వీరమల్లయ్య



**కాకతీయ, చేర్యాల :** న్యాయవాది గూడెపు శ్రీధర్‌పై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని చేర్యాల బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. నాగపురి గ్రామంలోని శ్రీధర్ ఇంటిపై దాడి చేసి, కారు అద్దాలు ధ్వంసం చేయడంతోపాటు ఆస్తి నష్టం కలిగించి, చంపుతామని బెదిరించిన ఘటనను తీవ్రంగా ఖండించింది. పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని, న్యాయవాదులకు భద్రత కల్పించాలని కోరింది. దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆరేళ్ల వీరమల్లయ్య మాట్లాడుతూ.. న్యాయవాది శ్రీధర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మెరుగు రమేష్, సీనియర్ న్యాయవాది భూమిగారి మనోహర్, పొన్నం సురేష్, నల్గొండ సంతోష్, తాటికొండ ప్రణీత్, గుస్క వెంకటేష్, పర్వతం రాములు, మోకు రాజిరెడ్డి, నీరటి రాజలింగం, దర్శనం ప్రశాంత్, అంకణి సురేందర్, బైరగోని ప్రసాద్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బల్దియా గ్రీవెన్స్.. అధికారులకు అర్ధదిన సెలవు!

- 11 నుంచి 1 వరకే ప్రజావాణి.. ఆ తర్వాత అధికారుల జాడేది?
- దరఖాస్తులతో తిరుగుతున్న బాధితులు.. పరిష్కారం ఎక్కడ?
- ఐఏఎస్ అధికారిని నియమించాలంటున్న నగర ప్రజలు



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న బల్దియా గ్రీవెన్స్‌పై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే అధికారులు ప్రజావాణికి హాజరవుతున్నారని, అనంతరం కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఫీల్డ్ తనిఖీలు, సమావేశాల పేరుతో అధికారులు వెళ్లిపోతుండటంతో దరఖాస్తుల పరిష్కారం ఆలస్యమవుతోందని వాపోతున్నారు. ఇంటి నంబర్ తొలగించి మరొకరికి కేటాయించారని ముగ్గురు వ్యక్తులు రెండు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. మరో కేసులో ఒక సర్వే నంబర్‌పై ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించినప్పటికీ సంబంధం లేని మరో సర్వే నంబర్‌పై ఉన్న కోర్టు కేసు ఓఎస్ నంబర్ 2998/2022ను చూపించి దరఖాస్తును రద్దు చేశారని బాధితులు ఆరోపించారు. పలు కాలనీల్లో రెండు, మూడు నెలలుగా తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సమస్యపై పలుమార్లు దరఖాస్తులు ఇచ్చినా స్పందన లేదని వాపోతున్నారు. బల్దియాకు పట్టు ఉన్న ఐఏఎస్ అధికారిని నియమిస్తేనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పలువురు కోరుతున్నారు.

## గిరిజన దర్బార్‌లో ప్రజల సమస్యలు విన్న ఐటీడీఏ పీఓ

- 30 దరఖాస్తులు స్వీకరించిన లెనిన్ వత్సల్ టోప్పో
- నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం
- ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



**కాకతీయ, ఏటూరునాగారం రూరల్:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, సంబంధిత అధికారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దర్బార్‌లో మొత్తం 30 దరఖాస్తులు అందాయి. ఇందులో ఇందిరా జల ప్రభకు 8, ఆర్‌సీఓ మహబూబాబాద్ పరిధిలో 6, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ విభాగానికి 6, డీటీఆర్ఓ.ఎఫ్ఆర్‌కు 3, ఎస్‌డీసీకి 2, డీడీ ట్రైబల్ వెల్ఫేర్, వెంకటాపురం తహసీల్దార్, ఎస్సీ కార్పొరేషన్, సీహెచ్‌సీకి ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఉద్యోగాలు, డిప్యూటేషన్, కారుణ్య నియామకాలు, రోడ్లు, భవన నిర్మాణాలు, పైప్‌లైన్ పనులు, రోడ్డు రోలర్ మంజూరు తదితర అంశాలపై దరఖాస్తులు అందాయి. శ్రీ ఆంజనేయ ట్రైబల్ సాండ్ క్వారీ కోఆపరేటివ్ సొసైటీలో సుమారు 40 మంది సభ్యులను తొలగించారన్న ఫిర్యాదును సంబంధిత అధికారికి విచారణ కోసం పంపించారు. కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ జనార్దన్, ఏపీఓ ప్రతాప్, ఈఈ ప్రవీణ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అతిథుల వివరాలు నమోదు చేయాలి

- లాడ్జీలు, హోటళ్లలో నిబంధనల అమలు తప్పనిసరి
- హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్



**కాకతీయ, హన్మకొండ :** లాడ్జీలు, హోటళ్ల యజమానులు, నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీలు, హోటళ్ల యజమానులు, నిర్వాహకులతో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి అతిథి వివరాలను గెస్ట్ రిజిస్టర్‌లో నమోదు చేసి, గుర్తింపు పత్రాలను పరిశీలించిన తర్వాతే గదులు కేటాయించాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అనుమానాస్పద వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలీసుల తనిఖీల సమయంలో రిజిస్టర్లు, సీసీటీవీ ఫుటేజ్, ఇతర రికార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సతీష్, కిషోర్ పాల్గొన్నారు.



## ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- విమానాశ్రయం నుంచి వస్తున్న వాహనాల్లో మద్యం బాటిళ్ల తనిఖీ
- రెండు బృందాల దాడుల్లో 123 మద్యం బాటిళ్లు స్వాధీనం

**కాకతీయ, హైదరాబాద్:** ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు పహాడ్ షరీఫ్ వద్ద వాహనాలను తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఏ, బీ బృందాల సీఐలు రమేష్, గణపతిరెడ్డి సిబ్బందితో కలిసి విమానాశ్రయం నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోవా, ఢిల్లీ ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న 42 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. మరోవైపు ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీ, డీ బృందాల సీఐలు వెంకటేశ్వర్లు, నాగరాజులు సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో మరో 81 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. వీటిని కూడా శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐలు తెలిపారు.

## రిజిస్ట్రేషన్, స్టాంప్స్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా హరికోట్ల రవి

- మూడేళ్ల కాలానికి నూతన కార్యవర్గం ఎన్నిక
- అసోసియేట్ అధ్యక్షురాలిగా తస్లీమా మొహమ్మద్.. కార్యదర్శిగా జి. నరేంద్ర



**కాకతీయ, హైదరాబాద్ :** తెలంగాణ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ గెజిటెడ్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. మూడేళ్ల కాలానికి నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా హరికోట్ల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల అధికారి జి. వెంకటేశ్వర్లు నూతన కార్యవర్గం ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. సంఘం అసోసియేట్ అధ్యక్షురాలిగా తస్లీమా మొహమ్మద్, కార్యదర్శిగా జి. నరేంద్ర, కోశాధికారిగా వి. సీతారామ్ ఎన్నికయ్యారు. వివిధ పదవులకు ఎన్నికైన వారితో కలిపి మొత్తం 33 మందితో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఎన్నికల అనంతరం నూతన అధ్యక్షుడు హరికోట్ల రవి మాట్లాడుతూ సంఘ సభ్యుల ప్రయోజనాలు, అధికారుల సమస్యల పరిష్కారం, శాఖలో సమన్వయం కోసం నూతన కార్యవర్గం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఎన్నికతో రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖలోని గెజిటెడ్ అధికారుల సమస్యలను సంఘం ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఏర్పడిందని సభ్యులు తెలిపారు. మూడేళ్ల కాలంలో సంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## పెళ్లి చేసుకునే వరకు ఇక్కడే ఉంటా!

- ప్రియుడి ఇంటి ముందు టెంట్ వేసి యువతి మౌన పోరాటం
- మూడేళ్లు ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్నాడంటూ ఆరోపణ
- వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ ఇంటి ముందు ఉద్రిక్తత..



**కాకతీయ, రాయపర్తి/వర్ధన్నపేట :** ప్రియుడు వచ్చి తనను పెళ్లి చేసుకునే వరకు ఇంటి ముందు నుంచి కదిలేది లేదంటూ ఓ యువతి టెంట్ వేసి మౌన పోరాటానికి దిగింది. వర్ధన్నపేటలో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. బాధితురాలు తుమ్మల శ్రీదేవి తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కుమారుడు శ్రీకాంత్ 3 ఏళ్లుగా తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లొంగదీసుకున్నాడని ఆరోపించింది. ఇటీవల పెళ్లి విషయమై నిలదీయగా నిరాకరిస్తూ మొహం చాటేశాడని, పెద్దలను ఆశ్రయించినా సరైన సమాధానం ఇవ్వలేదని పేర్కొంది. రాజకీయ అధికార బలంతో తనను, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించింది. శ్రీకాంత్ వచ్చి పెళ్లి చేసుకునే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేసింది. న్యాయం జరగకపోతే ప్రాణాలు తీసుకుంటానంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

## శ్మశాన భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

- దళితుల సమాధుల ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి
- శంకరపట్నం సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ డిమాండ్



**కాకతీయ, శంకరపట్నం:** కేశవపట్నం గ్రామంలో ధ్వంసమైన దళితుల సమాధులను గ్రామ సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ నేతకాని కుల సంఘం పెద్దమనుషులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సమాధులను ధ్వంసం చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఘటనను కేవలం సమాధుల ధ్వంసంగా కాకుండా దళిత సమాజంపై జరిగిన దాడిగా పరిగణించి, బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితుల సమాధుల విషయంలోనూ కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్మశాన వాటికలకు కేటాయించిన భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్మశాన భూముల హద్దులను గుర్తించి స్పష్టమైన మార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సమాధుల ధ్వంసంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గొల్లిపెల్లి శ్రీనివాస్, దుర్గం నరేష్, మారుతి, నరేష్, బిక్షపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెండు మూడు నెలల్లో పార్టీ రూపురేఖలు

కొత్త రాజకీయ పార్టీ నిర్మాణం కాగితాలపై మాత్రమే జరగదు. ప్రజల్లోకి వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. అందుకే తెలంగాణవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల కేంద్రంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్‌లో సమావేశాలు చేపట్టాం. వివిధ వర్గాల ప్రజల నుంచి స్పందన వస్తోంది. ప్రజాస్వామికవాదులు, ప్రజా సమస్యలపై పనిచేస్తున్న వ్యక్తులు, వివిధ సామాజిక వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావాలని నిర్ణయించాం. ఈ సమావేశాల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, పార్టీ విధివిధానాలను రూపొందిస్తాం. ప్రజల భాగస్వామ్యంతోనే జన తెలంగాణ నిర్మాణం జరగాలి. ప్రస్తుతం పార్టీ నిర్మాణానికి సంబంధించిన సన్నాహక ప్రక్రియ కొనసాగుతోంది. రానున్న రెండు మూడు నెలల్లో పార్టీ పేరు పూర్తిస్థాయిలో ఖరారయ్యే అవకాశం ఉంది. పార్టీ పేరు కంటే ముందు దాని విధానం, ప్రజల పట్ల బాధ్యత, కార్యాచరణ స్పష్టంగా ఉండాలి. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధిని కేంద్రంగా చేసుకుని విధానాలను రూపొందిస్తాం. ప్రజల సమస్యలపై పోరాటాలు నిర్మించి, ఆ పోరాటాల నుంచే రాజకీయ శక్తిని నిర్మించాలన్నది మా ఆలోచన. ప్రజాస్వామికవాదులందరినీ కలుపుకుంటాం. తెలంగాణ కోసం జరిగిన పోరాటాల స్ఫూర్తిని ప్రజా సమస్యల పరిష్కారానికి మళ్లించాలి.



# జనం గుండెల్లో జెండా ఎగురేస్తాం

## ప్రజాస్వామిక వాదులమంతా ఒక్కటవుతాం

తెలంగాణలో మరో రాజకీయ వేదికకు కసరత్తు మొదలైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు మాజీ మావోయిస్టు నేత, తెలంగాణ ఉద్యమకారుడు లంకా పాపిరెడ్డి ప్రకటించారు. 'జన తెలంగాణ' లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్తామని.. విద్య, వైద్యం, ఉపాధి ప్రధాన ఎజెండాగా ఉద్యమాలు నిర్మిస్తామని వెల్లడించారు. తెలంగాణ సాధించినా ప్రజలు ఆశించిన మార్పు రాలేదని, రాష్ట్ర సాధన వెనుక ఉన్న ఆకాంక్షలు నెరవేరలేదని అన్నారు. పాలకులు ప్రజా ప్రయోజనాల కంటే కమీషన్ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజల్లో అసంతృప్తి ఉందని పేర్కొంటూ.. ఆ ఖాళీని ప్రజాస్వామిక రాజకీయ ప్రత్యామ్నాయంతో భర్తీ చేయాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ఉమ్మడి జిల్లాల కేంద్రంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ వివిధ వర్గాలను సమీకరిస్తున్నామని, రెండు మూడు నెలల్లో పార్టీ పేరు ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన రాజకీయ ఆలోచనలు, భవిష్యత్ కార్యాచరణపై లంకా పాపిరెడ్డి మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

### మార్పు కోసం మరో రాజకీయ వేదిక అవసరం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల జీవితాల్లో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రజలు ఏ ఆకాంక్షలతో పోరాడారో.. ఏ త్యాగాలు చేశారో.. ఆ లక్ష్యాలు పూర్తిగా నెరవేరలేదు. రాష్ట్రం ఏర్పడితే మన వనరులు మనకు ఉపయోగపడతాయని, యువతకు ఉద్యోగాలు వస్తాయని, విద్య, వైద్యం మెరుగుపడతాయని భావించాం. కానీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించలేకపోయాయి. అందుకే ప్రజల సమస్యల ఆధారంగా కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని భావిస్తున్నాం. ఇది ఎవరికీ వ్యతిరేకంగా వ్యక్తిగత రాజకీయ ప్రయోగం కాదు. ప్రజా సమస్యలను రాజకీయ ఎజెండాగా మార్చే ప్రయత్నం. ప్రజాస్వామిక పద్ధతిలో కొత్త పార్టీని నిర్మించి 'జన తెలంగాణ' దిశగా ముందుకు వెళ్లాలన్నది మా ఆలోచన.



### ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి రాజకీయ పరీక్ష

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. పట్టభద్రుల సమస్యలను దగ్గరగా తెలుసుకోవడం, వారి అభిప్రాయాలను వినడం, కొత్త రాజకీయ వేదికను వారిలోకి తీసుకెళ్లడం ఈ ప్రయత్నంలో ప్రధాన ఉద్దేశం. ఎన్నికలు కేవలం ఓట్ల కోసం మాత్రమే కాకుండా ప్రజా సమస్యలను రాజకీయ చర్చలోకి తీసుకురావడానికి కూడా ఒక వేదిక కావాలి. యువతలో నిరుద్యోగం, ఉద్యోగ భద్రత, విద్యా అవకాశాలు, ఉపాధి వంటి అంశాలను విస్తృతంగా చర్చిస్తాం. ఈ ఎన్నికల ద్వారా పట్టభద్రులకు మరింత దగ్గర కావాలన్నది ప్రస్తుతం మా ముందున్న లక్ష్యం. తెలంగాణ సాధించినప్పుడు ప్రజలు ఒక కొత్త జీవితాన్ని ఆశించారు. ఆ ఆశలు ఇంకా పూర్తిగా నెరవేరలేదన్న భావన ప్రజల్లో ఉంది. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పే రాజకీయ ప్రక్రియ అవసరం. ప్రజలను కేవలం ఎన్నికల సమయంలో గుర్తుచేసుకునే రాజకీయాలకు భిన్నంగా.. నిరంతరం ప్రజల మధ్య ఉండే రాజకీయ వేదికను నిర్మించాలి. ప్రజల సమస్యలపై పోరాడాలి. ప్రజలే ఉద్యమాలను నిర్మించాలి. ప్రజలే రాజకీయ ప్రత్యామ్నాయాన్ని బలోపేతం చేయాలి. అందుకే 'జన తెలంగాణ' దిశగా అడుగులు వేస్తున్నాం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరే వరకు ప్రజాస్వామిక పద్ధతిలో మా ప్రయాణం కొనసాగుతుంది.

### మూడు పార్టీలకు భిన్నమైన ఎజెండాతో జనంలోకి

ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ పోటీ కొనసాగుతోంది. కానీ ప్రజల మౌలిక సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయి. నిరుద్యోగం, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలపై ప్రజలకు స్పష్టమైన పరిష్కారాలు కావాలి. అందుకే సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలనే మా రాజకీయ చర్చకు కేంద్రంగా చేయాలనుకుంటున్నాం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక రాజకీయ వేదికను నిర్మిస్తాం. వ్యక్తుల చుట్టూ కాకుండా ప్రజా సమస్యల చుట్టూ రాజకీయాలను నడపాలి. అధికారమే లక్ష్యంగా కాకుండా ప్రజా ఉద్యమాల నుంచి రాజకీయ నిర్మాణం రావాలన్నదే మా ఉద్దేశం.



- జన తెలంగాణ పేరుతో కొత్త రాజకీయ వేదికకు సన్నాహాలు
- ప్రజాస్వామికవాదుల సమీకరణ ప్రయత్నాలు
- రెండు మూడు నెలల్లో పార్టీ పేరు ఖరారు
- కాంగ్రెస్.. బీఆర్ఎస్.. బీజేపీలకు ప్రత్యామ్నాయమే మా లక్ష్యం
- ప్రజా సమస్యలే ఎజెండా.. విద్య, వైద్యం, ఉపాధిపై పోరాటం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు కసరత్తు
- తెలంగాణ రాష్ట్ర సాధనతోనే ఆకాంక్షలు నెరవేరలేదు
- పాలకులు కమిషన్ ఏజెంట్లుగా మారారు
- ప్రజలే రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నడపాలన్నది ఆకాంక్ష
- తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో మాజీ మావోయిస్టు నేత, తెలంగాణ ఉద్యమకారుడు లంకా పాపిరెడ్డి చిట్‌చాట్



### విద్య, వైద్యం, ఉపాధి.. మూడు ప్రధాన పోరాటాలు

ప్రజలకు అత్యంత అవసరమైనవి విద్య, వైద్యం, ఉపాధి. ఈ మూడు రంగాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. విద్యారంగాన్ని పాలకులు నిర్లక్ష్యం చేశారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని గాలికి వదిలేశారు. వైద్య రంగంలో కార్పొరేట్ ఆధిపత్యం పెరిగింది. ఉపాధి పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముప్పై ఏళ్లు వచ్చినా యువతకు ఉద్యోగం లేక, ఉపాధి లేక ఇబ్బందులు పడుతోంది. గ్రామాల్లో అప్రత్యక్ష నిరుద్యోగం విస్తరిస్తోంది. వ్యవసాయం సంక్షోభంలో ఉంది. పరిశ్రమలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. కేవలం సర్వీస్ సెక్టార్‌ను చూపించి అదే అభివృద్ధి అని చెప్పడం వల్ల ప్రజల జీవితాల్లో స్థిరమైన మార్పు రాదు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధి రంగాల బలోపేతమే మా కార్యాచరణకు కేంద్రంగా ఉంటుంది. తెలంగాణలో పాలకులు కమీషన్ ఏజెంట్లుగా మారిపోయారని నేను భావిస్తున్నాను. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రజా ప్రయోజనాలను పక్కన పెడుతున్నారు. రాష్ట్ర సంపద, వనరులు, అభివృద్ధి ప్రయోజనాలు ప్రజలకు చేరాలి. కానీ వ్యవసాయం, పరిశ్రమలు బలోపేతం కాకుండా కేవలం సర్వీస్ సెక్టార్‌ను అభివృద్ధిగా చూపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ప్రశ్నించాలి. ప్రజల సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలి. నిజాయితీగా పనిచేస్తే ప్రజలే మన వెంట వస్తారు. డబ్బు లేకపోయినా ప్రజల నమ్మకం ఉంటే ఉద్యమం నిర్మించవచ్చు. చరిత్రలో అనేక ప్రజా ఉద్యమాలు దీనినే నిరూపించాయి.

### ఉద్యమ నేపథ్యం.. రాజకీయ ప్రయాణానికి పునాది



నా రాజకీయ ప్రయాణం చిన్ననాటి నుంచే ఉద్యమ నేపథ్యంతో సాగింది. మాది దామెర మండలం తక్కళ్లపాడు. పుట్టి పెరిగింది వరంగల్ ఆజంజాహి మిల్స్ కాలనీ పక్కన ఉన్న గాంధీనగర్‌లో. నాన్న అనంతరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు. చిన్నపెద్దనాన్న కమ్యూనిస్టు భావజాలంతో ఉండేవారు. అన్న మురళీమోహన్‌రెడ్డి ప్రభావంతో చిన్న వయసులోనే వామపక్ష భావజాలం వైపు ఆకర్షితుడినయ్యాను. 1976లో సుమారు 14 ఏళ్ల వయసులో అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లి అరెస్టయ్యాను. అనంతరం 1981లో మళ్లీ అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లి పీపుల్స్‌వార్ ఉద్యమంలో దళసభ్యుడిగా, కమాండర్‌గా, జిల్లా కార్యదర్శిగా, సెంట్రల్ కమిటీ సభ్యుడిగా వివిధ బాధ్యతలు చేపట్టాను. 2008లో అనారోగ్య కారణాలతో అప్పటి హోంశాఖ మంత్రి జానారెడ్డి ముందు లొంగిపోయాను. 2009 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్నాను. ఈ ఉద్యమ అనుభవాలే ప్రస్తుతం ప్రజా సమస్యల ఆధారంగా రాజకీయ ప్రత్యామ్నాయం నిర్మించాలన్న ఆలోచనకు పునాది.



ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266